# కొరివి దయ్యాలు

ఆ పదిమంది బ్యాంకు వాళ్ళూ వసంత వన విహారం పేరుతో రెండు రాత్రుళ్ళూ, రెండు పగళ్ళూ గడపటానికి ఆ తోట కొచ్చారు. శుక్రవారం సాయంత్రం బ్యాంకు టైమయ్యాక బయలు దేరారేమో అంతా తోటకి చేరేటప్పటికి సూర్యాస్తమయమవుతూంది. వాళ్ళు తమ సామాను పెంకుటింట్లో పడేసి తోటంతా ఒక రవుండు తిరిగి చూసొచ్చారు.

ఆ పెంకుటింట్లో తూర్పు వైపు రెండు గదుల్లోనూ తోటమాలి కాపరముంటున్నాడు. పెంకుటింటికి ఉత్తరం వైపునున్న వసారాలో వంటవాడు పొయ్యి వేశాడు. ఆ వసారాకి యాభై గజాల దూరంలో ఉత్తరం దిక్కుగానే గురువింద, గచ్చ, పుల్లరేగు, కోరింత, నాగజెముడు పొదలతో నిండిన కొరడి ఉంది. ఈ మధ్యలో అంతా ఖాళీ స్థలమే. ఆ కొరడికి అవతల, నడుమెత్తు బలుసు పొదలతో నిండిన ఇంకో ఆసామి తాలూకు బీడుంది. ఇంక తోటలో, పెంకుటింటికి పడమరన పాతి గ్గజాల దూరంలో మొజాయిక్ రాళ్ళు పరచిన మంటపం ఒకటుంది. కానీ అది పాతలకాలపుది. మంటపానికి ఆ కొరడికీ మధ్యకూడా ఖాళీ స్థలమే. కానీ, ఆ ఖాళీస్థలంలోనే ఒక నేరేడు చెట్టూ, వాయువ్యంగా ఒక వేపచెట్టూ ఉన్నాయి. మంటపానికి దక్షిణంగా ముప్పై గజాల దూరంలో దిమ్మమీద నిలబెట్టిన శిలావిగ్రహమొకటుంది. ఆ విగ్రహం మంటపం కేసి చూస్తూన్నట్టుంది. తోటలో ఇంకా చాలా రకాల ఫలవృక్షాలున్నప్పటికీ గున్నమామిడి చెట్లు మాత్రం ఎక్కువ. అవన్నీ విగ్రహానికి వెనక వైపు గానే దక్షిణంగానే ఉన్నాయి.

ఆరున్నరకి అందరికీ అద్భుతమైన టీ ఇచ్చాడు వంటవాడు. ఏడున్నరకి ఇంకా అద్భుతమైన విందు భోజనం కూడా వడ్డించేశాడు. ఎవరో వంటవాడితో పరాచికమాడారు. '' కుక్కు శ్రేష్ఠా, నువ్వు మామూలు కుక్కువి కావు. మాకు నూతన రుచులందించేఘనుడివి. కెప్టెన్ కుక్కువి!'' అని సరసాలాడుకుంటూ అంతా భోజనాలు పూర్తి చేసి త్రేనుస్తూ విగ్రహం వైపు వసారాలో కొచ్చి సిగరెట్లు ముట్టించే టప్పటికి ఎనిమిదిన్నరయింది.

చుట్టూ తోటంతా చీకటి దట్టంగా అలుముకుంది. ఉత్తరంవైపు పొదల్లోనూ, దక్షిణం వైపు చెట్ల కొమ్మల్లోనూ మిణుగుర్లు విపరీతంగా ఎగురుతున్నాయి. కీచురాళ్ళ రొద విషయం చెప్పనక్కరలేదు. అప్పుడప్పుడు వినిపిస్తున్న ఒఖఒవో, ఒఖఒవో అనే నక్కల కూతలూ, ఏటి కవతల చింతలపూడి - ఏలూరు రోడ్డుమీద తిరిగే ఒకటీ అరా బస్సుల శబ్దమూ తప్పిస్తే మరక్కడ ఇంకేం శబ్దమూలేదు.

చుట్టూ చూస్తూ దమ్ము పీలుస్తూ నుంచునున్న వికాసరావు, సత్యారావుతో అన్నాడు '' అహో, ఏం గార్డెను స్మెల్సు, బాసూ! ఇన్ని రకాల చెట్ల మధ్య ఇంతింత ఆకాశం కింద, ఈ చీకట్లో ఇట్లా మనం పదిమందిమీ హాయిగా, స్వేచ్ఛగా, పెళ్ళాం బాధ లేకుండా, పెద్ద బాసువూసు లేకండా మనమూ, మన కార్డ్సూ, మెక్డోవెల్సూ! వోహ్'' మంటపంలో చటుక్కున ఆచారీ, సత్యారావూ పల్లంలోకి దిగారు. కుడివైపు చూశారు.దూరంగా కొరడుపొదల్లో రెండు గోళాలు మెరుస్తున్నాయ్. ఆచారి నేరేడుచెట్టు వైపు పదడుగులు వేసి ఆగి పోయాడు వెనకాల వెళ్ళబోయాడు సత్యారావు '' ఆగాగు, రాకు'' అని ఆచారి అనగానే సత్యారావు ఆగిపోయాడు రెండు, మూడు, పది, ముప్పై క్షణాలు గడిచాయి ఆ గోళాలు అక్కడి నుంచి కదల్లేదు వికాసరావూ, సత్యారావూ చటుక్కున వరండాలో కెళ్లారు టార్చి తేవటానికి మూడు

నాలుగు నిమిషాలు పట్టింది. ఆగోళాలక్కడ లేవు. నేరేడు చెట్టు వైపునుంచి వెనక్కి తిరిగొచ్చేస్తూ ఆచారి, "టార్చి వెయ్యక్కర్లేదయ్యా- అవిమాయమై పోయినయ్యి" అన్నాడు.

"ఏంటంటారు?" విలాసరావు అన్నాడు. "ఏం చెప్పమంటావు? ఏవయినా కావచ్చు! నేను చూసి ఛస్తే కదా చెప్పటానికి!" నవ్వాడు ఆచారి. "రండి కూర్చుందాం" అన్నాడు. మంటపం వైపు నడిచాడు. విలాసరావు సత్యారావు వైపు భయం భయంగా చూశాడు. ఇద్దరూ ఆచారిని అనుసరించారు.

మంటపంలో అప్పటికే మిగతా ఏడుగురూ పెట్రోమాక్స్ లైట్‌తో వచ్చి జంపకానాలు సరిచేసి కూర్చునున్నారు. ఆచారి వెళ్ళగానే "ఏంటది గురూగారూ?" అన్నారు.

గోచీ సవరించుకుంటూ కూర్చున్నాడు ఆచారి. నాలుగైదు క్షణాలు ఆలోచించి అన్నాడు, "నేనేం చెప్పనయ్యా బాబూ! అసలీ తోటే వూరికి ఉత్తరంగా ఉంది. దానికి తోడు తమ్మిలేటొడ్డు! కంటిక్కనిపించని ప్రాణులిక్కడ తిరుగుతున్నాయన్నా ఆశ్చర్యపడక్కర్లేదు."

పక్కకొచ్చి కూర్చున్న విలాసరావు ఆదుర్దాగా ముందుకు జరిగి అడిగాడు, "దయ్యాలంటారా కొంపదీసి?" ఆచారి విలాసరావు మొహంలోకి చూశాడు. చుట్టూ కూర్చునున్న అందరి మొహాల్లోనూ కనబడుతున్న కుతూహలాన్నిపరిశీలించాడు. నాలుగైదు క్షణాలాగి అన్నాడు, "ఏం - ఎందుక్కాకూడదూ? ఈ తోటలో కనీసం ఒక దయ్యమైనా ఉందని ఢంకా బజాయించి చెప్పగల్ను... అయినా, ఎందుకు లెండి, చచ్చిన జమీందారు ప్రేమకథ రాత్రిపూట చెప్పకూడదు!"

శ్రోతల్లో కుతూహలం పెరిగింది. ఎవరో అన్నారు, "దయ్యాల కథలు మాక్కొత్తకాదు. మేంచదివేదీ అవే, చూసేవీ అవే! చెప్పండి పర్లేదు."

ఆచారిఅందుకున్నాడు, "సరేనయ్యా, మీరు చెప్పమంటే నాకేం కష్టం! రాజా ప్రేమకుమార్ నాయుడు బహద్దూర్ అనే జమీందారు ఈ తోటకి పూర్వపు యజమాని. ఆయన తన భార్యని అమితంగా ప్రేమించేవాడు. కానీ, తనకన్నా చిన్నవాడైన దివాన్ కొడుకుతో ఆ రాణి అక్రమ సంబంధం పెట్టుకుంది. రాజు ఆమెను మందలించాడు. ఆకోపం కొద్దీ ఇట్లాంటి వో వేసవి రాత్రి ఇట్లాంటి విహారానికే ఆ రాజును తోటకు తీసుకొచ్చి ఆ రాణి రాజుకి బ్రాందీ పట్టించేసింది. తన ప్రియుడి సహాయంతో అతని కాళ్ళూ చేతులూ కట్టేసింది. కింద పడేసింది. రాజును గొంతు పిసికి చంపేసింది. అప్పట్నుంచీ ఆ రాజు దయ్యమయి ఈ తోట్లోనే తిరుగుతున్నాడు. రాజు పడి చచ్చిన చోటే రాజును తగలబెట్టి అక్కడే విగ్రహం నిలబెట్టారు కొడుకులు. ఆ విగ్రహం ఇదుగో ఇది!" ఆచారి చీకట్లో విగ్రహం వైపు చూపించాడు.

వాళ్ళు ఆ సాయంత్రం చూసిన విగ్రహమే అయినా ఇప్పుడది నల్లగా భయంకరంగా అందరికీ కనిపించింది. దానికి తోడు దాని వెనకాలున్న చెట్ల తలలు, నక్షత్రాల బాక్‌గ్రౌండ్‌లో ఏవేవో వింతవింత ఆకారాల్లో వూగుతూ కనిపిస్తున్నాయి.

ఉండుండి సత్యారావు అడిగాడు, "రాణి ఎక్కడ చచ్చిపోయింది?"

"కేరళలో. తన కొడుకు పట్టాభిషేకానికి ఏనుగును కొందామని వెళ్ళి, ఒక మదపుటేనుగు ఆమె వెనుక నుంచొచ్చి ఆమెను దభీమని పడేసి తొక్కేస్తే, దాని కాళ్ళకింద పడి భయంకరంగా అరుస్తూ విరిగి,నలిగి, నుజ్జునుజ్జయిపోయి చచ్చూరుకుంది." "ఇది జరిగి ఎన్నేళ్ళయింది?"

"అబ్బో మా నాన్న చిన్నప్పుడు , నూట ఇరవై ఏళ్ళక్రితం!"

"అయ్యా గురూగారూ, చిన్న సందేహం. జమీందారు కొడుకులు ఇన్నేళ్ళుగా తండ్రికి తద్దినం పెడుతున్నారు గదా. 'సమస్త జీవులూ సుఖించుగాక' అని ప్రతినిత్యమూ సత్పురుషులు కొందరైనా

నిత్యమూ ధ్యానిస్తూ వుండనే ఉన్నారుగదా- వీటిల్లో వేటివల్లా ఇంతకాలం బట్టీ ఆ దిక్కుమాలిన రాజు దయ్యానికి విముక్తి కలగనే లేదంటారా? పోనీ, ఈ దయ్యం కేరళ వెళ్లి ఆ రాణి దయ్యంతో హాయిగా ఆ అడవుల్లో తిరగొచ్చుగా!''

ఆచారి చిరాగ్గా అన్నాడు, ''ఏమయ్యోయ్, ప్రతి పాయింటుకూ సమాధానం ఉంటుందనుకోకు. కానీ ఒక్కటి మాత్రం నిజం! ఆ జమీందారు దయ్యం ఇప్పటికీ అనేక రూపాల్లో అనేక మందికి కనిపిస్తూనే ఉందని వినికిడి.''

''ఇదొహటా! అనేక రూపాల్లో కనిపించటం కూడానా!''... ''యస్ బ్రదర్! కొంతకాలం చెట్ల గాల్లో కలిసిపోయి 'రాణి, రాణి' అని పిలుస్తున్నట్టూ, కొంతకాలం రాజువేషమూ రాణి తలతోనూ, ఇంకొంత కాలం భయంకరమైన ఎర్ర్ర్ర్ర్రటి కళ్లతో నాలిక వేళ్లాడేసుకుని తిరిగే నల్ల్ల్ల్ల్లటి కుక్క ఆకారంలోనూ ఈ తోటలో తిరుగుతూన్నట్టూ, ఇసక బళ్ళవాళ్ళు చెప్పుకుంటారు.''... ''ఇప్పుడే ఆకారంలో తిరుగుతోందిట?''

''ఇప్పుడా, ఇప్పుడా...'' ఆచారి ఆగాడు. తలొంచుకుని నాలుగైదు క్షణాలు ఆలోచించాడు. సావకాశంగా నెమ్మదిగా అన్నాడు, ''కొరివిదయ్యం ఆకారంలోట! తోటమాలి చెప్పాడు.''

అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. నూతిలోంచివస్తున్న గొంతుతో విలాసరావు అడిగాడు ''కొరివి దయ్యం అంటే ఏంటి సార్?''

నవ్వుతూ అన్నాడు ఆచారి, ''నిప్పులాగా కనిపించే దయ్యమన్నమాట! ... ఎర్రటి నిప్పులాగా గెంతుతూ కనిపించేవి, మెరుపు మెరిసినట్టు చప్పుడు లేకుండా కనిపించేవి, భగ్గుమని మంటలాగా కనిపించేవి, ఒకే చోటుండిపోయి నిప్పు కణాల్ని అన్ని దిక్కులకీ పంపుతున్నట్లు మెరిసి మాయమయ్యేవి- ఇట్లా సవాలక్షున్నాయి వీటిల్లో!'' ఆచారి చటుక్కున లేచి ''దాహమవుతోంది, మంచి నీళ్ళు తాగొస్తానర్రా'' అంటూ వంట వసారాలో కెళ్లిపోయాడు.

మంటపంలో అందరూ భయం భయంగా దిక్కులు చూడ్డం మొదలు పెట్టారు. మాటలు కరువయ్యాయి, వచ్చిన కొద్ది మాటలూ దయ్యాల్ని గురించే రావటం మొదలెట్టాయి.

పది నిమిషాల తరువాత ఆచారి వచ్చాడు. వస్తూనే అన్నాడు, ''ఆఁ, ఎక్కడున్నామూ, జ్ఞాపకం వచ్చిందర్రా! ఈ రాజుగారి కొరివిదయ్యం కణకణ మండే నిప్పులాగా ఉంటుంది. అది బయటి కొచ్చి తిరిగే సమయం ఇదే కూడా! అసలే కొరివి దయ్యమైనా బయటికొచ్చేది ఇప్పుడే ననుకో!''

కీచు గొంతుతో అడిగాడు విలాసరావు, ''నన్నేమన్నా చేస్తుందా సార్?''... ''మనమేం చెయ్యకపోతే మనల్నేం చెయ్యదు. అసలొక సారేమయిందంటే, నేను సోంపేటలో పని చేస్తున్నప్పుడు అయిదు మైళ్ళు దూరంలో ఉన్న బారున నించి నడిచొస్తున్నా. అర్ధరాత్రి! కటిక చీకటి! ఎవరో జుట్టు విరబోసుకున్నట్టు రోడ్డు పక్కన ఈతచెట్లు! ఏం, కొంత దూరం వచ్చేసరికి దూరంగా దీపం కనిపించింది. ఏదో మనిషే ననుకుని దాని వెనకాల పడ్డా. అది పోయి పోయి చేతులు చాపుకుని నుంచునున్న, బ్రహ్మాండమంత ఎత్తున్న ఒక భయంకరాకారంతో కలిసిపోయింది! ఆ ఆకారం నామీదికి రాబోయింది. కెవ్వ్వ్వ్ వ్వున కేకేసి నేను పడిపోయాను. తెల్లారి మెలకువ వచ్చి చూద్దును కదా- నే నున్నది జిండి భద్ర దగ్గరగా, రోడ్డుకు ఫర్లాంగు దూరంలో, ఎండి పోయిన రావిచెట్టు మొదట్లో! కనక కొరివిదయ్యమన్నా కొద్దిగా ఏడిపిస్తుందే కాని ప్రమాదకారి కాదు. నేను కనక దాని మీదికి రాళ్లూ గీళ్లూ వేశాననుకోండి, అసలు నా అడ్రసుండేది కాదు. నేనూ ఈ పాటికి దయ్యమయి మీ చుట్టూ తిరుగుతూండేవాడిని!''

ఎవరి మొహానా కత్తి వేటుకు నెత్తురుచుక్క లేదు. ఎవరికీ వూపిరి ఆడటం లేదు!

హఠాత్తుగా విలాసరావు " అదుగో కొరివిదయ్యం. గచ్చ పొదలో !" అని అరిచాడు.

అంతా అటు చూశారు కణకణ ముండే నిప్పులాంటిది పొదలో కదులుతూంది టక్కున ఆగిపోయింది పది క్షణాల తదవాత వెలగచెట్టు వెనకాల కన్పించింది. ఇంకో పది క్షణాల తదవాత బంతి లాగా గెంతుతూ వాయువ్య మూలగా కనిపించింది ఇంకో నాలుగయిదు చోట్ల కనిపించినట్లు కనిపించి ఆరిపోయి హఠాత్తుగా తాటిచెట్టు మీద కనిపించి ఇక కనిపించటం మానేసింది.

వూపిరి బిగబట్టి అంతా అవాక్కయి పోయారు. ఆ అయిదు నిమిషాల కాలంలో ఏ ఒక్కడూ చెయ్యయినా వదలకుండా, ఏ స్థితిలో ఉన్న వాళ్లు ఆ స్థితిలో శిలా విగ్రహాల్లా బిగుసుకు పోయారు. ఉండుండి గబ్బిలాలు వాళ్ళ తలలమీంచి సర్రున దూసుకు పోతున్నాయి

ఆచారి " భయంలేదు, భయం లేదు" అన్నాడు. వాళ్ళు కదిలారు. ఒకళ్ళకొకళ్ళు దగ్గరగా ఇంకా దగ్గరగా జరిగి కూర్చోవటం మొదలు పెట్టారు. గొంతులు మాత్రం ఎవ్వరికీ ఇంకా పెగలట్లేదు. పక్కనే ఎక్కడో పాము కప్పను పట్టుకుంది. కీచుకీచుమని ఆ కప్ప అరిచే అరుపు వీళ్ళని మరింత అదర గొడుతూంది. ఇద్దరు ముగ్గుర్లేచి మంటపం కిందికి ఎట్లాగో దిగెళ్ళి పాస్ పోసుకుని దబదబా వెనక్కొచ్చేశారు.

నాలుగయిదు నిమిషాలు చూసి చూసి ఆచారిఅన్నాడు. " ఆ కొరివి దయ్యం నివాసం ఆ తాటి చెట్టయ్యా! ఎక్కింది గనక ఇహ దిగదు. ఇంకోసారేమయిందో చెబుతాను వినండి " లో గొంతుతో ఎవడో అన్నాడు, " రాత్రి పూట వనవిహారమేంటి నా బొంద పోదాం పదండి."

ఇంకొరెవరో అన్నాడు. " అవునవును. కానీ ఉక్కా, గబ్బిలాల కంపూ భరించగలమా అని?" ఆచారి ఎగతాళిగా అన్నాడు. " ఏం కుర్రాళ్ళయ్యా ఈ మాత్రానికే భయమా! నా కిట్టాంటి భయాలేం లేవు. నా గుండె ఉక్కు గుండె. ఏం - ఇంకోసారి నేను తోటపల్లిలో పన్చూసుకుని నాగావళి మీద బ్రిడ్జి దాటి పార్వతీపురం వస్తున్నా, అంటే నిర్మానుష్యమైన రోడ్డుమీద నాలుగు మైళ్ళు ఒంటరి ప్రయాణమన్నమాట. నాలుగు దీపాలు కనిపించినాయి. ఆ చీకట్లో అదే దోవ కాబోలనుకుని వాటి వెనకాల పడ్డాను. పోగా, పోగా ఏవేవో నల్లని ఆకారాలు కనిపించాయి. ఈ దీపాలు మాయమయ్యాయి. ఎవరో వచ్చి నన్ను ముట్టుకున్నట్టయింది. అంతే స్పృహ తప్పిపడిపోయాను పొద్దున్నే లేచి చూస్తే నేనున్నది అడ్డావు శిల దగ్గరగా. దొమ్మరాళ్ళ గుడిసెలకి కొంచెం దూరంగా బురదగుంట పక్కన! అడ్డావు శిల అని ఒక చిన్న కొండ ఒక బ్యూటిఫుల్ పిక్నిక్ స్పాట్ ఉందిలే అక్కడ! దాని దగ్గిర. అందుచేత వీటి గోల ఇంతా అంతా కాదు."

ఇంకో పది నిమిషాలు గడిచాయి. ఆచారి ఇంకో రెండు దయ్యం కథలు చెప్పాడు చివరికి " సరేలే. ఇహ పోయి పడుకుందాం పదండి. దడిసి దడిసి అట్టాగే బిగుసుకు పోతారో ఏమో,"

హఠాత్తుగా విలాసరావు విగ్రహం వైపు చూపిస్తూ అరిచాడు. " బాబోయ్, ఇంకో దయ్యం అదుగో, అదుగో!".. అంతా చూశారు. దూరంగా మామిడి చెట్ల కొమ్మల్లో హఠాత్తుగా భగ్గుమని మండి, మంట ఆరిపోయింది. మళ్ళీ ఇంకోచోట మండి టక్కున ఆరిపోయింది. అంతా నుంచున్నారు. ఆచారికూడా నుంచున్నాడు. రెండు నిమిషాలు గడిచాయి ఇందాకటి కన్నా దగ్గరగా ఇంకో చెట్టు మీద మళ్ళీ భగ్గుమంది. ఇంకో నిమిషం తరవాత కొంచెం దగ్గరగా నేలమీద నిలువెత్తు పవనమొక్క వెనకాల భగ్గుమంది.

విలాసరావు భయంతో వణికిపోతూ, గట్టిగా అరిచేశాడు. " ఈ దయ్యం మీది కొచ్చేస్తోంది బాబోయ్ పదండి, పదండి."

అంతే! అంతా గబాగబా మంటపంలోంచి వసారాలోకి ఒకే అంగలో దూకేశారు

మంటపంలో ఆచారి ఒక్కడే మిగిలిపోయాడు తీక్షణ్ణంగా చూస్తున్నాడు చీకట్లోకి రెండు నిముషాలు గడిచాయి

ఈసారి దూరంగా చెట్లమీద బాగా పెద్ద మంటతో భగ్గుమంది ఆచారి చేతులు కట్టుకుని స్తంభాని కానుకొని తీక్షణంగా అటు చూస్తూనే ఉన్నాడు

ఇంకో రెండు నిముషాలు గడిచాయి విగ్రహానికి పది గజాల దూరంలో మామిడి చెట్టు మీద పెద్ద మంట భగ్గుమంది. అప్పుడే తీతువు పిట్ట మంటపం మీంచి అరుచుకుంటూ పోయింది. గబ్బిలం ఒకటి, అతని నెత్తిన కొట్టినంత పనిచేస్తూ స్ర్రున ఎగురుకుంటూ వచ్చి చటుక్కున వెనక్కు మళ్ళింది. మరుక్షణంలో ఫెళాఫెళా బ్రహ్మాండమైన శబ్దం, ఆ వెంటనే భయంకర మైన గుడ్లగూబ అరుపు, దబ్బుమని ఒక గుడ్లగూబ ఎగిరొచ్చి మంటపంలో పడి వెంటనే లేచి ఎగిరిపోవటం - వరస వరసగా జరిగిపోయాయి

" అంబాబోయ్!" ఆచారి ఒక్క గావుకేక పెట్టాడు! చటుక్కున మంటపం దిగి వసారావైపు పరుగెట్టాడు. వసారాలో కెక్కుతునే అతని పంచె కాలికి అడ్డుపడి అతను ముందుకు తూలిపడి పోయాడు. " నిజం దయ్యం బాబోయ్" అన్నది అతని ఆఖరి మాట!

విలాసరావు తలుపు తెరిచాడు. వాళ్లంతా ఆచారిని లోపలికి మోసుకు వెళ్ళారు. తలుపులు బిడాయించేశారు.

★ ★ ★

పది నిముషాల తర్వాత తలుపు కొడుతూన్న చప్పుడైంది. లోపల వణుకుతూన్న వాళ్లు ఇంకా వణకటం ప్రాదంభించారు బయటినుంచి వినిపించింది. " సత్యారావుని, భయంలేదు, తలుపుతియ్యండి. మీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డు!"

తలుపు తెరుచుకుంది. వరండాలో సత్యారావు పక్కన తోటమాలున్నాడు. చేటలో కన్నం పొడిచి, ఆ కన్నంలో బిగుతుగా దూర్చిన నివురు గప్పిన పొయి కట్టె తోటమాలి చేతిలో ఉంది. సత్యారావు చేతిలో కిర్సనాయిలు సీసా అగ్గి పెట్టె ఉన్నాయి అతని నోరంతా కిరసనాయిలు కంపు కొడుతుంది. చెట్టు మీంచి కింద పడ్డాడనటానికి నిదర్శనంగా అతని మోచేతులూ నుదురూ గీరుకుపోయి వున్నాయి.భయం భయంగా అనుమానంగా చూసుకుంటూ ఒక్కొక్కరే బయట కొచ్చారు. సత్యారావు నోట్లో కిర్సనాయిలు పోసుకొని వూ( అని దాన్ని గాల్లోకి విరజిమ్మి చటుక్కున ఆ జల్లులోకి అగ్గిపుల్ల వెలిగించాడు. భగ్గుమని మంటొచ్చి ఆరిపోయింది! సత్యారావు లోపలి కొచ్చి పడిపోయున్న ఆచారిని చూవాడు. " నీళ్లు కొట్టి లేవదీయండి. మెక్డోవల్ గొంతులో పొయ్యండి" అన్నాడు.

ఇంకా అన్నాడు. " పూర్ ఫెలో! చెట్లెక్కే దయ్యాలున్నప్పుడు భగ్గుమనే దయ్యాలుంటాయని తెలీని వాడు.!"

విలాసరావన్నాడు అనుమానంగా - " చెట్టెక్కింది.."

" ఆచారిగారు పురమాయిస్తే తాటిచెట్టేం ఖర్మ, ఏ చెట్టయినా ఎక్కుతాడు తోటమాలి! కొరికి దయ్యం పాత్ర చక్కగా నిర్వహిస్తాడు అన్నట్టు గోళాల దయ్యాన్ని కూడా చూస్తారా? .. అదిగో చూడండి!" విలాసరావు బయటికి తొంగిచూశాడు. తోటమాలి గది గుమ్మంలో పడుకోనుంది బలిసిన నల్ల కుక్క! దాని కళ్ళు ఇందాకట్లాగే భయంకరంగా మెరుస్తున్నాయి!

ఎవరో వెనకాల్నుంచి అన్నారు " మరయితే దయ్యాల్లేవంటారా బాస్?" సత్యారావన్నాడు. " అనవసరం, అసలా చర్చే అనవసరం! ఈ చర్చలు ఏ నాడూ తెగి చావవు. దేవుడూ దయ్యం వగైరా

శక్తులున్నా లేకపోయినామనమంటూ ఉన్నాం కదా! మన మీద మనం పూర్తి విశ్వాసంతో పని చెయ్యాలి కదా! మరి చేస్తున్నామా? ఈ అవసరమైన విశ్వాసాన్ని వదిలేసి ఆ అనవసరమైన విశ్వాసాన్ని పట్టుకుని మరీ మనల్ని మనం నిర్వీర్యుల్ని చేసుకుంటున్నాం. మత్తు జల్లి మనిషిని పరిస్థితులకు బానిసని చేస్తున్నాం. సస్పెన్సు కావాలంటే, మహానుభావుల జీవితాల్లోని సమస్యలూ వాటి పరిష్కారాలు లేవా? రక్తాన్ని ఉడికించి ఉడికించి హటాత్తుగా చల్లబరిచే చాణక్యనీతి కథల్లో ఎక్కడేడ్చిందయ్యా అసలైన సస్పెన్స్ , మనిషి గుండె బద్దలు కొట్టి చంపడం తప్ప. పూర్ ఫెలో, ఐ పిటీ మిస్టర్ ఆచారి! ... ఇట్లా కొలాప్స్ అయిపోతాడనుకోలేదు!"

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 26-10-83)

* * *     * * *     * * *

# నీశ్రాద్ధం పెడతా అనే 'అతి' కథ

" ఏవయ్యోయ్, రిటైరైన హెడ్ మాస్టరూ, నేనొచ్చేసాను, యముణ్ణి! నీక్కాలం తీరింది, వచ్చెయ్ పోదాం!"

" అయ, అయ, నమస్కారం. వస్తాను బాబూ. అతిగా ఏ అవయవానికా అవయవం శిథిలమై పోయున్న వాణ్ణి. మీరు రమ్మంటే రాకేం చేస్తాను!... కానీ బాబూ ఒక్క మనవి!"

" ఏంటది?... చెప్పెయ్" ... " నేను పనిచేసే రోజుల్లో నాకింది బి.యిడి మాస్టరు క్లాసులకి సరిగ్గా వెళ్ళటంలేదని చిన్న చురక లాగ అతని కొక ఇంక్రిమెంటును ఆర్నెల్లపాటు ఆపుచేసాను. దాంతో వాడు అన్యాయంగా తన కడుపు మండించుకొని ఓ రోజు ఫస్టు పిరియడ్‌లో గబ్బిలాల మర్రిచెట్టు కింద నన్ను నిలేసి, - చూస్కో నీకు శ్రాద్ధం పెట్టి తీర్తాను!- అన్నాడు. అతగాడు ఆనాడు అతిగా రెచ్చిపోయి అట్లా అనటం నాకు బాధకలిగించింది కానీ, అయ్యా ఇప్పుడు నేను సంతానం గానీ దాయాదిగానీ లేని వాణ్ణి, కనక వాడిప్పుడు నాకు నిజంగా శ్రాద్ధం పెడితే బాగుండు ననిపిస్తోంది తమరు కాస్త ఓపిక చేసుకొని... ఆ కాస్త వివరమూ.. అతగాడి దగ్గర్నించి.. అందుకొచ్చారంటే .. మీకు ఋణపడుంటాను మీతో సంతోషంగా వచ్చేస్తాను."

" ఏం లిటిగేషన్ మనిషివయ్యా !... సరే కనుక్కొస్తాన్లే!"

* * *

" ఏవయ్యా హెడ్ మాస్టరూ, నువ్వు బి యిడి అసిస్టెంటుగా ఉన్నప్పుడు అప్పటి నీ హెడ్ మాస్టరికి శ్రాద్ధం పెడతానన్నావట. నిజంగా పెడతావా? నువ్వా హామీ ఇస్తేనే గానీ నాతో రానంటున్నాడు ఏవంటావ్?"... " చిత్తం చిత్తం! యాభైఅయిదేళ్ల రిటైర్మెంటు సమ్మెట పోటుతో హఠాత్తుగా అతిగా పోటొచ్చి గుండె కొట్టుకోటం మానేసిన వాణ్ణి! ఏకైక పుత్రుణ్ణి అమెరికాకు అర్పించుకున్న వాణ్ణి. అయ్యా,